సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 5 । జూన్ । 2025



పేకాట జోరు.. బతుకు తారుమారు

కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడా కనిపించకపోయినా పేకాట క్లబ్బులు జిల్లాలోని మంత్రి ఇలాకాలో మూడు పువ్వులు 36 కాయలుగా కనిపిస్తున్నాయి. - 12లో



భారీగా మొబైల్‌ఫోన్లు రికవరీ

పోలీస్ బృందం చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. - 12లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.200
రెండోరకం	రూ.120	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1726 మెట్రిక్ టన్నులు



వంచనపై గర్జన

- కూటమి ప్రభుత్వ పాలనపై వెల్లువెత్తిన నిరసన
- ర్యాలీలు, ప్లకార్డులతో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ర్యాలీ అనంతరం అధికారులకు వినతుల సమర్పణ
- వైఎస్సార్ సీపీ చేపట్టిన కార్యక్రమానికి అన్ని వర్గాల మద్దతు



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాయచోటిలో నిర్వహించిన వెన్నుపోటు ర్యాలీ



బి.కొత్తకోట : ములకలచెరువు పీటీఎంరోడ్డు నుంచి కూడలిలోకి వస్తున్న వెన్నుపోటు దినం నిరసన ప్రదర్శన



రాజంపేట : రాజంపేట-రాయచోటి రోడ్‌లో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ

సాక్షి రాయచోటి : రాష్ట్రంలో అరాచక పాలనకు తోడు అక్రమాలు, అన్యాయాలతో బెదిరింపు ధోరణితో వెళుతున్న ప్రభుత్వ తీరుపై నిరసనగళం పెల్లుబుకుతోంది. ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలిచ్చి అన్నింటినీ మాయ చేస్తున్న కూటమి సర్కార్‌పై ప్రజలు కన్నెర్ర చేస్తున్నారు. సూపర్‌సిక్స్ అంటూ అధికారంలోకి రాగానే... బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ అనే తరహాలో మారిపోయింది. ఇంటింటికి సంక్షేమం ఆగిపోగా....ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అభివృద్ధి ఆగిపోయింది. అంతేకాదు...వైఎస్సార్ సీపీ హయాంలో జిల్లాకు మంజూరైన పనులు సైతం తిరోగమన బాట పట్టడంపై వైఎస్సార్ సీపీ భగ్గుమంది.

అధికార పగ్గాలు చేపట్టి ఏడాది అవుతున్నా హామీల అమలు చేయకుండా మోసపూరిత మాటలతో ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు గళమెత్తాయి. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ...ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకుండా కూటమి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు చేసిన నినాదాలు జిల్లా అంతటా మార్మోగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటుదినం సందర్భంగా భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

రాజంపేటలో భారీ ర్యాలీ

పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. రాజంపేట పాత బస్టాండులోగల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసినంతరం భారీ ర్యాలీగా నినాదాలు చేస్తూ సబ్ కలెక్టరేట్ వరకు హోరెత్తించారు. మెయిన్‌రోడ్డులో పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో నిరసన ర్యాలీ హోరెత్తింది. అనంతరం సబ్ కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

రాయచోటిలో కలెక్టరేట్ ఎదురుగా నిరసన

జిల్లా కేంద్రమైన రాయచోటిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన సాగింది. అన్నమయ్య సర్కిల్ నుంచి జాతీయ రహదారి మీదుగా కలెక్టరేట్ మెయిన్ గేటు వద్దకు చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టి...దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అన్నమయ్య సర్కిల్ నుంచి కలెక్టరేట్ భవనం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ర్యాలీలో శ్రీకాంత్‌రెడ్డితోపాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్ రెడ్డి,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషలతోపాటు వేలాది మంది పార్టీ శ్రేణులు కలెక్టరేట్ ఎదుట కదం తొక్కాయి.

ములకల చెరువులో కదం తొక్కిన కార్యకర్తలు

తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో ములకలచెరువు అంతా కార్యకర్తలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులే కనిపించారు. వేలాది మంది కార్యకర్తలు, శ్రేణులతో ద్వారకనాథరెడ్డి టీడీడీ కల్యాణ మండపం నుంచి రెండు కిలోమీటర్ల మేర నిరసన ర్యాలీతో హోరెత్తించారు. ఎక్కడ చూసినా కార్యకర్తలతో నిండిపోవడం....జెండాలు, ప్లకార్డులతో కొత్త ఊపు కనిపించింది. టీటీడీ కల్యాణ మండపం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించినంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

రైల్వేకోడూరులో కదిలిన జగనన్న సైన్యం

రైల్వేకోడూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కడప పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై ర్యాలీగా కదులుతూ నినాదాలతో మార్మోగించారు. రైల్వేకోడూరులోని అతిథి గృహం నుంచి టోల్ గేట్ వరకు వెళ్లి అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించినంతరం నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చి నిరసనలో పాలుపంచుకున్నారు.

పీలేరులో నిరసన గళం

వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిరసన గళం వినిపించారు. కూటమి సర్కార్ హామీలు అమలు చేయని మొండి వైఖరి నశించాలని ముందుకు కదిలారు. పీలేరులోని మదనపల్లె క్రాస్‌రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగించారు. పెద్ద ఎత్తున జెండాలు, ప్ల కార్డులతో ప్రభుత్వం కళ్లు తెరిపించేలా నినాదాలు చేస్తూ జై జగన్ అంటూ హోరెత్తించారు. అనంతరం తహసీల్దార్ భీమేశ్వరరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు.

మదనపల్లెలో కూటమి కుతంత్రాలపై నిరసన

జిల్లాలోని మదనపల్లె పట్టణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ సాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల పాల్గొన్నారు. మదనపల్లెలోని చిత్తూరు బస్టాండు నుంచి ర్యాలీ ప్రారంభమై సబ్ కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు పార్టీ శ్రేణులు వినతిపత్రాన్ని సమర్పించాయి.

నిరసనకు అన్ని వర్గాల మద్దతు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం సందర్భంగా నిరసనలు చేపట్టారు. అయితే కూటమి సర్కార్ ఏర్పడి ఏడాది కాలమవుతున్నా ఏ ఒక్కటి అమలు చేయకుండా నియంతృత్వ పోకడలు అవలంభిస్తున్న విధానాలపై ప్రజలు కూడా భగ్గుమన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు అన్ని వర్గాల ప్రజల నుంచి కూడా పూర్తి స్థాయిలో మద్దతు లభించింది. పార్టీ క్యాడర్‌తోపాటు కదలివచ్చిన ప్రజలతో ర్యాలీలు భారీ ఎత్తున విజయవంతం కావడంతో అంతటా కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.



రాజంపేట : సబ్‌కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న మేడా, ఆకేపాటి



బి.కొత్తకోట : వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



రైల్వేకోడూరులో నేతల నిరసన ర్యాలీలో కొరముట్ల శ్రీనివాసులు



పీలేరులో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

సంక్షేమ పాలనను మరిచిన బాబు ప్రభుత్వం..

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి

సంక్షేమ పాలనను బాబు ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి అన్నారు. బుధవారం పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆకే పాటి అమర్నాథ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఎన్నో ఆశలు అడియాసలు అయ్యాయి అన్నారు. ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై 60 శాతం ప్రజా వ్యతిరేకత పుంతలు తొక్కుతోంది అన్నారు. రాష్ట్రంలో అమరావతి ఒకటే కాదని అనేక ప్రాంతాల అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఏదైతే హామీలు ఇచ్చారో అవి అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

'సూపర్ సిక్స్' ఓ భ్రమ

– ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం లేకుండా వైఎస్ఆర్సిపి నేతలను ఏ విధంగా అక్రమ కేసులో ఇరికించాలన్న రీతిలో పాలన సాగుతోంది అన్నారు. చంద్రబాబు పాలనపై జనం విసుగెత్తిపోయారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలో. ప్రజలు ప్రజలకు మేలైన కార్యక్రమాలు జరిగేవి అన్నారు. చంద్రబాబు నాయుడు పాలనతో బేరీజు వేసుకుంటున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక భ్రమ అని, ఆ భ్రమలో ప్రజలను బురిడీ కొట్టించారని ఆకేపాటి ధ్వజమెత్తారు.

జగన్ పాలనే మేలు..

– ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మేలని ప్రజలు అనుకుంటున్నారని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. ప్రజలకు కల్లబొల్లిమాటలు చెప్పి, ఓట్లు దండుకున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు కనిపించకుండా పోయాయన్నారు.. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా జనగన్న పాలన కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారదాహంతో అక్రమకేసులు పెట్టడమే ధ్యేయంగా ముందుకెళుతోందన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రశ్నించరా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : తంబళ్లపల్లె అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేస్తే ఆ పార్టీల నేతలు ఎందుకు మాట్లాడం లేదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రశ్నించారు. వైఎస్.జగన్ పిలుపుతో బుధవారం మండల కేంద్రం ములకలచెరువులో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ రూ.4,350 కోట్లతో చేపట్టిన హంద్రీనీవా-గాలేరునగరి ప్రాజెక్టుల అనుసంధాన పథకం పనులు నిలిపివేస్తే రైతులు, ప్రజకు నష్టపోతారని తెలిసినా ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.వెయ్యి కోట్లకుపైగా ఖర్చు చేస్తే దాన్ని వృథా చేస్తూ కరువు రైతులకు తీరని ద్రోహం చేశారన్నారు. రూ.1,291 కోట్లతో హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ వెడల్పుకు పనులు చేపడితే ఎందుకు రద్దు చేశారో అడగలేరా అని ప్రశ్నించారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి మంజూరు చేయించిన విద్యుత్ సబ్‌స్టేషన్లను రద్దు చేసి వాటిని కుప్పానికి తరలించుకుంటే మన ప్రాంతానికి అన్యాయం చేస్తారా అని నిలదీయలేరా అని ప్రశ్నించారు. ప్రతిఇంటికి కొళాయిల ద్వారా మంచినీటిని అందించాలని గండికోట నుంచి వాటర్‌గ్రిడ్ పనులకు టెండర్లు, సర్వే పూర్తి చేస్తే రూ.2,350 కోట్ల పనులను నిలిపివేయించి తాగునీటికి అడ్డపడిన ప్రభుత్వ తీరును నిలదీయలేరా అని కూటమి నేతలను ప్రశ్నించారు. ముదివేడు రిజర్వాయర్‌ను రూ.775 కోట్లతో చేపట్టి పనులు పూర్తి చేయిస్తుంటే కోర్టుకు వెళ్లి పనులు నిలిపివేయించిన టీడీపీ నేతలను..మన ప్రాంత అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ఇంతటి అభివృద్ధిని కూటమి నేతలు తేగలరా అని సవాల్ చేశారు. కరువు ప్రాంతం సస్యశ్యామలం కాకూడదనే అక్కసుతోనే వాటిని అడ్డుకున్నారని అన్నారు. కాలువ పనులకోసం నిల్వ ఉంచిన ఇసుకను అమ్ముకున్న నేతలు ములకలచెరువులోనే ఉన్నారని విమర్శించారు.

ప్రజలను నమ్మించి

నట్టేట ముంచారు

గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : పథకాలు అడిగితే ఖజానా ఖాళీ అంటారు, లోకేష్, పవన్, చంద్రబాబు ప్రత్యేక విమానాల్లో తిరుగుతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. బుధవారం రాయచోటిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మఒడి అడిగితే ఇవ్వరు, ప్రశ్నిస్తే నోరు మెదపరని కూటమి నేతలపై మండిపడ్డారు. 12 నెలలు కాలంలో లక్ష, 51 వేల కోట్లు అప్పు చేసినా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. మహిళలకు చెప్పిన హామీల్లో ఒకటైన ఉచిత బస్సు తుస్సుమందన్నారు. సంక్రాంతిలోపు రోడ్లు పూర్తి చేస్తామని చెప్పిన రోడ్ల మీద తిరిగితే నడుం నొప్పులు వస్తున్నాయన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పిన చంద్రబాబు ఆయన హయాంలో ఎన్ని అప్పులు చేశారో ఆధారాలతో నిరూపిస్తే మాపై ఎదురుదాడులు చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో మూడు లక్షల, 44 వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించారన్నారు. ఒక్క సంక్షేమాన్ని కూడా అమలు చేయకుండా రూ. 1.50 లక్షల కోట్లు అప్పు చేసి ఎంచేద్దాం..చూస్తే భయమేస్తోందని మాట్లాడటానికి చంద్రబాబుకు సిగ్గుండాలన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మంగళం పాడిందన్నారు. దేశానికి వెన్నుముకగా నిలిచే అన్నదాతలను నిలువునా మోసం చేశారన్నారు. గ్రామ స్వరాజ్యానికి ఊపిరులూదిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచిన వాలంటీర్ వ్యవస్థను రద్దు చేసి వారి ఉసురు పోసుకుంటారని శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి ఒక సంవత్సర కాలంలోనే 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. ఒకటో తేది వచ్చిందంటే అవ్వా, తాత అనే పిలుపు వినిపించడం లేదు. వారికి భరోసా ఇచ్చే మనుషులు ఇంటికి రావడం లేదు.ఇప్పుడు ఒకటో తేది వస్తోందంటే వారిలో ఆందోళన మెదలవుతోంది. అబద్దాల కోటపై పాగా ఎగురవేసిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి అడుగులోనే అవ్వా తాతలపై కక్ష కట్టారన్నారు. చంద్రబాబు చరిత్ర వెన్నుపోటు చరిత్ర అని, నాడు సొంత మామను వెన్నుపోటు పొడిచారని, నేడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారంటూ విమర్శలు గుప్పించారు.

పీఎం సూర్యఘర్ పథకం కింద రాయితీ

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం క్రింద మూడు కిలోవాట్ల పవర్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా 78 వేల రూపాయలు రాయితీ ఇస్తారని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ,ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్‌స్టాల్ చేసే వెండర్లు, ఎంపీడీఓలు తదితరులతో జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ఇన్‌స్టాల్ చేసుకోవాలనుకునే రిజిస్ట్రేషన్‌లు పెరగాలని విద్యుత్ శాఖ సిబ్బందిని, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీడీసీఎల్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు, డీఈలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆవులు, ఒంటెల వధ నిషేధం.. చట్టరీత్యా నేరం..

ఆవులు, ఆవుదూడలు, ఒంటెల వధ నిషేధం మరియు చట్టరీత్యా నేరమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ 'ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధం, చట్టరీత్యా నేరం' అనే అంశంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

హామీలు అమలు చేయలేని చంద్రబాబు

- ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించేది వైఎస్సార్ సీపీ
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

మదనపల్లె రూరల్ : నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ఒక్కసారైనా వెన్నుపోటు పొడవకుండా పరిపాలన చేశారా అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ప్రశ్నించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు హామీ ఇచ్చి వాటిని అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి శ్యామల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ రాఘవేంద్రకు, కూటమిపాలనలో ప్రజలు మోసపోయిన వైనంపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ...1994 ఎన్నికల తర్వాత చంద్రబాబునాయుడు సొంతమామ నందమూరి తారకరామారావుకు వెన్నుపోటు పొడిచారంట అని తన చిన్నవయస్సులో విన్నానని, 2024 ఎన్నికల తర్వాత ప్రజలకు ఆయన పొడిచిన వెన్నుపోటును ప్రత్యక్షంగా చూస్తున్నానన్నారు. చంద్రబాబు అంటే వెన్నుపోటు, వెన్నుపోటు అంటే చంద్రబాబు అని, ఒక్కసారైనా ప్రజలకు వెన్నుపోటు లేకుండా పరిపాలన చేశారా అని ప్రశ్నిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన పొడిచిన వెన్నుపోటు గురించి చెప్పాలంటే ఎక్కడ నుంచి ఆరంభించాలో అర్థం కావడం లేదన్నారు. పసికందుల నుంచి రక్షణ కల్పించలేని కూటమిప్రభుత్వం, ఆడపిల్లలకు పొడిచిన వెన్నుపోటు నుంచి మొదలుపెట్టాలా..? అబద్ధపు హామీలతో గద్దెనెక్కినటువంటి కూటమి నాయకుల నుంచి మొదలుపెట్టాలా..? రైతుల కన్నీటితడి నుంచి ప్రారంభించాలా..? ఎండీయూ వాహనాలు రద్దుచేసి కొన్ని లక్షల కుటుంబాలను రోడ్డుమీదకు లాగేసిన దగ్గర నుంచి మొదలు పెట్టాలా.? డీఎస్సీ అభ్యర్థులను అతి దారుణంగా వెన్నుపోటు పొడిచారని...ఇలా చెప్పుకుంటూ పోతే ఎక్కడ నుంచి మొదలుపెట్టాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. కూటమిప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు మరచిపోతే వాటిని గుర్తుచేసేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి సిద్ధంగా ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎదురు నిలబడి మాట్లాడలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. చివరకు బడి కెళ్లే పిల్లలు... పదో తరగతి పిల్లలను సైతం కూటమిప్రభుత్వం దారుణంగా వెన్నుపోటు పొడిచిందన్నారు. అదేదో సామెత చెప్పినట్లు...పనిగల పనిమంతుడు పందిరి వేస్తే...తాటాకు తగిలి ఊడిపోయిందంట.. అన్నట్లు కూటమి ప్రభుత్వం పరిస్థితి తయారైందన్నారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబు, ఒకసారి సీఎంగా పనిచేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిన అప్పుల్లో, 40శాతం అప్పులు మొదటిఏడాదిలోనే చంద్రబాబు చేసేశారన్నారు. మళ్లీ అధికారంలోకి వైఎస్.జగన్ వస్తారని, ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకుంటామని, అప్పటివరకు కూటమిప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, నాయకులు ఎస్ఆర్‌వి దండుశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మేరీ, రోలింగ్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.



డీఏఓకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, నిస్సార్ అహ్మద్

క్లుప్తంగా

కళాకారులు కారణ జన్ములు



ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాజంపేట : కళాకారులు కారణ జన్ములని, ఆ కోవలోనే సుమధుర గానంతో అలరించిన మహామహులు కై వల్యాన్ని పొందారని నటుడు, గాయకుడు అరవ మోహన్ రావు, సినీ గేయ రచయిత గీతం పుండరీక పేర్కొన్నారు. బుధవారం ఆలాపన ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతి సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజంపేట రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు జబ్బి రెడ్డి, ఎస్.కళాంజలి, ఆర్కెస్ట్రా నిర్వాహకులు సునీల్, పెంచలయ్య, శ్రీను, రంగస్థల నటుడు సంగీత సుబ్బరాయుడు, గేయ రచయిత బల్ల సుబ్రమణ్యం హరి, గీతం రేణు, వరకుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో దుకాణం ధ్వంసం



షాపును పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని లక్ష్మీ నరసింహ ఎల్కక్ట్రికల్ షాప్‌ను జాసర్ అనే వ్యక్తి పాత కక్షలతో ధ్వంసం చేసినట్లు షాపు యజమాని అక్కి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మంగళవారం వెంకటరమణ తన షాపును రాత్రి 9.30 గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడన్నారు. సుమారు 11.30 గంటల సమయంలో జాసర్ తన షాపు షట్టర్ పగుల కొట్టి అక్రమంగా షాపులోనికి ప్రవేశించి షాప్‌లోని మొత్తం వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు రూ.10 వేలను ఎత్తుకెళ్లాడని ఫిర్యాదు చేశాడన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి ట్యాంకు కూల్చివేత

ఓబులవారిపల్లె : మండలంలోని గొబ్బూరు వారిపల్లి గ్రామంలో ఉపరితల జలాశయం నీటి ట్యాంకును తొలగించారు. 2018 సంవత్సరం నాబార్డ్ నిధులతో గ్రామంలో రూ.11 లక్షల వ్యయంతో నీటి ట్యాంకులు నిర్మించారు. అయితే చాలా రోజుల నుంచి నీటి ట్యాంకు నిరుపయోగంగా ఉండటంతో యంత్రాల సాయంతో తొలగించారు. ఈ విషయంపై ఎంపీడీఓ మల్‌రెడ్డి మాట్లాడుతూ నీటి ట్యాంకు తొలగించిన విషయం తన దృష్టికి రాలేదని నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకు రామాలయ నిర్మాణానికి అడ్డుగా ఉన్నందున తొలగించారని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. గ్రామస్తులు ఎవరూ ఈ విషయంపై ఎలాంటి అభ్యంతరాలు కానీ, ఫిర్యాదు చేయలేదన్నారు. అనంతరం గొబ్బూరువారిపల్లి గ్రామంలో నీటి ట్యాంకును బుధవారం వారు పరిశీలించారు.

యువతి ఆత్మహత్య

గాలివీడు : మండల పరిధిలోని అరవీడు గ్రామం సింగవారిపల్లెకు చెందిన రెడ్డప్ప కుమార్తె రెడ్డమ్మ(16) ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు బుధవారం తమ గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాట జోరు.. బతుకు తారుమారు

- జాకీ, క్వీన్, కింగ్, ఆన్ అంటూ జిల్లాలో పేకాట స్థావరాలు
- ఎక్కడికక్కడ జేబులు నింపుకుంటున్న మంత్రి అనుయాయులు
- రోజుకు టర్నోవర్ కోటి రూపాయలు పైబడే
- రాయచోటి, చిన్నమండెం కేంద్రాలుగా యథేచ్ఛగా జూదం
- జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్న పేకాట

టాస్క్‌ఫోర్స్ : కూటమి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడా కనిపించకపోయినా పేకాట క్లబ్బులు మాత్రం అన్నమయ్య జిల్లాలోని మంత్రి ఇలాకాలో మూడు పువ్వులు 36 కాయలుగా కనిపిస్తున్నాయి. జాకీ, క్వీన్, కింగ్, ఆన్ అంటూ పేకాట స్థావరాలు విరాజిల్లుతున్నాయి. అసాంఘిక కార్యక్రమాల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన ఖాకీ, ఖద్దరులే కాపలాగా మారి పేకాట స్థావరాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఒక్క చిన్నమండెం మండల పరిధిలోనే రోజుకు కోటి రూపాయలకు పైగానే పేకాట జరుగుతున్న మాట అక్షర సత్యం, రాయచోటి పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాలలో నూతనంగా నిర్వహిస్తున్న గృహాలు, గ్రామీణ ప్రాంతాలలోని మామిడి తోటలు, ఫామ్ హౌస్‌లలో పేకాట జోరుగా నడుస్తోంది. ఆట నిర్వహణ ద్వారా రోజుకు లక్షల రూపాయలు ఆదాయాన్ని నిర్వాహకులు గడిస్తున్నారు. వచ్చిన ఆదాయంలో మంత్రి అనుయాయులకు సగం డబ్బులు ముడుతున్నట్లు ప్రచారం ఉంది. ఆటలలో పాల్గొని వారి నుంచి ఎంట్రీ ఫీజుగా రూ. 3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వీటి నిర్వహణలో పోలీస్ శాఖలోని ఓ నిఘా అధికారి ఇటీవలనే పేకాట కారణంగా సస్పెండ్‌కు గురైనా పోలీసు హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు పక్కనే ఉన్న చిన్న మండెం మండలంలో పేకాట జోరుగా సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూర్చున్న చోటనే సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో కొంత మంది జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆశకు వెళ్లి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మంత్రి నియోజకవర్గమైన రాయచోటి, ఆయన సొంత మండలమైన చిన్నమండెం మండల పరిధిలోని పలు ప్రాంతాలలో జూద శాలలు నడుస్తున్నాయి. ఎవరైనా పోలీసులకు సమాచారం ఇచ్చినా మంత్రి ఇలాకాలోని గ్రామాలలోకి పోలీసులు అడుగులు వేయలేక పోతున్నారు. ఒకవేళ దాడులు నిర్వహించినా స్టేషన్‌కు వెళ్లకుండానే పట్టుబడిన పేకాట రాయుళ్లు దర్జాగా ఇళ్లకు వెళ్తున్నారు. స్థానిక పోలీసుల నుంచి చర్యలు లేకపోవడంతో జిల్లా ఎస్పీ నేరుగా కొంతమంది సిబ్బందిని నియమించుకొని కఠిన చర్యలు చేపడుతున్నా జూదరుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదన్న వాదనలు ఉన్నాయి. అనేక మంది వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ కుటుంబ



సభ్యులు లక్షలు, కోట్ల రూపాయలు ఆస్తులు అమ్మి పేకాటలో పెట్టి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఇల్లు.. మామిడి తోటలే అడ్డాలు..

ఎవరికీ అనుమానం రాకుండా పేకాటరాయుళ్లు ఇల్లు, మామిడి తోటలు, ఫామ్ హౌసులు, అటవీ ప్రాంతాలలో ప్రత్యేక స్థావరాలపై ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆట ఆడేవారికి మినహా మరెవ్వరికీ సమాచారం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా పేకాట స్థావరాల వద్దకు జనం చేరుకుంటున్నారు. చీకటి పడే వరకు ఈ ఆటలు కొనసాగుతున్నాయి. రోడ్ల వెంట సీసీ కెమెరాలు, ఇన్‌ఫార్మర్లను పెట్టుకొని జూద శాలలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఇతర జిల్లాల నుంచి..

అన్నమయ్య జిల్లాలోని పేకాట స్థావరాలకు స్థానికులే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా జూదరులు పెద్ద ఎత్తున వస్తున్నారు. కడప, చిత్తూరు, అనంతపురం, కర్ణాటక రాష్ట్ర ప్రాంతాల నుంచి జూదరులు వస్తున్నారు. గ్రామాల వారిగా పోలీసులకు బాధ్యతలు అప్పగించినా దాడులు చేసి వాటి నివారణ చర్యలు చేపట్టిన సంఘటనలు లేవనే చెప్పవచ్చు. పేకాట ఆడుతున్న సమయంలో ఎవరైనా పోలీసులు దాడులు చేస్తే చాలా మంది జూదరులు వారి కళ్లు గప్పి పారిపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

మంత్రి ఇలాకాలో విచ్చలవిడిగా జరుగుతున్న పేకాట కారణంగా మంత్రి అనుయాయులకు రోజువారిగా సమకూరుతున్న ఆదాయాన్ని చూసి జిల్లాలోని మిగిలిన నేతలు కూడా పేకాట స్థావరాల నిర్వహణకు మొగ్గుచూపుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే పోలీసు శాఖలో పనిచేస్తూ సస్పెండ్‌కు గురైన కానిస్టేబుల్, కడపలో పోలీసులకే డాన్‌గా వ్యవహరిస్తున్న అశోక్ రెడ్డి, మదనపల్లికి చెందిన హేమంత్ రెడ్డి, చిన్నమండెంలోని నర్సరీ రమణ, మల్లూరు శేఖర్ రెడ్డి, నిఘా అధికారికి అత్యంత సన్నిహితుడైన దాబా అంజిలతోపాటు రాయచోటిలో మంత్రి ముఖ్య అనుచరుడు వీటి నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలియవచ్చింది.

అడ్డుకట్ట పడేది ఎలా. ?

విచ్చలవిడిగా జరుగుతున్న పేకాటను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టడం అవసరం. జూదం ఆడేవారికి కోర్టులో కఠిన శిక్షలు లేకపోవడంతో చాలా మంది పట్టుబడినా తమ ప్రవర్తన మార్చుకోవడం లేదని తెలుస్తోంది. పట్టుబడిన జూదరులు బయటకు వచ్చి మరలా పేకాట ఆడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తెస్తే తప్పా జూదానికి అడ్డుకట్ట పడేలా లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జేఎన్టీయూ ఒప్పంద అధ్యాపకుల నిరసన



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఒప్పంద అధ్యాపకులు

కలికిరి : సర్వీసు పునరుద్ధరణ విషయంలో యాజమాన్యం తీరుకు నిరసనగా జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్లు బుధవారం ప్రిన్సిపాల్ చాంబర్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పదమూడేళ్లుగా తాము విధులు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో నామినల్ బ్రేక్ పిరియడ్ అనంతరం తమను విధుల్లో చేర్చుకునే వారన్నారు. అయితే ఈ ఏడాది ప్రిన్సిపాల్ ఒక్కో డిపార్ట్‌మెంట్ వారితో రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించి తమను తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సర్వీసు పునరుద్ధరణపై తమతో చర్చించేందుకు ప్రిన్సిపాల్ అనుమతించక పోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి మృతి



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సర్ఫరాజ్

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జార్ఖండ్ వాసి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నె వద్ద బీడీఎస్ ఫంక్షన్ హాల్‌లో జార్ఖండ్‌కు చెందిన సర్ఫరాజ్ (27) పనిచేస్తున్నాడు. అతనికి ప్రతిరోజు సాయంత్రం జిమ్‌కు వెళ్లే అలవాటు ఉండటంతో, బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో మదనపల్లెలోని జిమ్ సెంటర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలోని డ్రైవర్స్ కాలనీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై అధిక రక్తస్రావమై తీవ్ర గాయాల పాలయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన తాలూకా పోలీసులు వాహనం అదుపుతప్పి కిందపడి గాయాలపాలై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే గుర్తు తెలియని వాహనం ఢీకొందా..? లేక వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందాడా అనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బస్సు చక్రాలు ఎక్కడంతో అటెండర్‌కు గాయాలు



తీవ్రంగా గాయపడిన అటెండర్ హరిప్రసాద్

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో బస్సు అటెండర్ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. అనంతపురం నుంచి మదనపల్లె, వాల్మీకిపురం, తిరుపతి మీదుగా చెన్నైకి వెళ్లే ఇంద్ర ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో డ్రైవర్ బస్సును హైవే మీదకు మళ్లించాడు. అయితే వెంటనే రోడ్డు పూర్తి కాలేదన్న కారణంతో..బస్సును వెనక్కు తిప్పేందుకు రివర్స్ తీస్తూ బస్సు అటెండర్ హరిప్రసాద్(58)ను గమనించమని చెప్పాడు. అతను బస్సు వెనుక వైపు నిల్చుని డ్రైవర్‌కు సూచనలిస్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. ఇది గమనించని డ్రైవర్ బస్సును వెనక్కు నడపడంతో హరిప్రసాద్ కాళ్లపై బస్సు వెళ్లింది. దీంతో ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. వెంటనే స్థానికుల సహాయంతో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. వాల్మీకిపురం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు తగదు

సాక్షి ఎఫెక్ట్



బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్

రాయచోటి టౌన్ : దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ రేషన్ షాపు డీలర్లకు సూచించారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన రేషన్.. పరేషాన్ అనే కథనంపై ఆయన స్పందించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని పలు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల వద్ద డీలర్లు పంపిణీ చేస్తున్న విధానంలో తేడాలు గమనించి వారిని హెచ్చరించారు. తూకాలలో మోసం చేయరాదని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కార్డుదారుడి వివరాలు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉన్న పెన్షన్ ఆధారంగా సరి చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భారీగా మొబైల్‌ఫోన్ల రికవరీ

- రూ.1.20 కోట్ల విలువ గల 601 మొబైల్‌ఫోన్లు అప్పగింత
- 7వ విడత మొబైల్ ఫోన్ల రికవరీ మేళా
- మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



బాధితులకు మొబైల్ ఫోన్లు రికవరీ చేసి ఇస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : పోలీస్ బృందం చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోంది. అన్నమయ్య జిల్లా పోలీసుల పరిధిలో ఏడో విడతగా 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఒక కోటి 20 లక్షల రూపాయల విలువ చేసే 601 మొబైల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చేతుల మీదుగా ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2024 నవంబర్ నుంచి మే నెల 2025 వరకు 1300 మొబైల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగతనంపై ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందం ద్వారా ఫోన్ల రికవరీ కోసం అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికతను వాడుకోవడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. నెల రోజుల వ్యవధిలో జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలిసిస్ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్ జోసెఫ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సంయుక్తంగా పనిచేశాయన్నారు. ఇప్పటి వరకు రూ.3.16 కోట్ల విలువ గల 1627 మొబైల్ ఫోన్లను 7 విడతలలో రికవరీ చేశామని తెలిపారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తామని చెప్పారు.

మొబైల్ ఫోన్ పోతే..

మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీస్ ఎల్ఎంటీఎస్ వాట్సాప్ నెంబర్ 8688830012కు హాయ్ అని మెసేజ్ చేసిన వెంటనే మీరు ఒక గూగుల్ లింక్‌ను రిసీవ్ చేసుకుంటారన్నారు. ఆ లింకును క్లిక్ చేసి మీ వివరాలు, మీ మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు మొదలగు వివరాలను తెలియపరుస్తూ ఆ మొబైల్‌ను కొన్న బిల్ పేపర్ లేదా మొబైల్ బాక్స్‌ను మీరు అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలని వివరించారు. లేదా సీఈఐఆర్ httpr://w-ww/-c-e-ir.g-o-v.i n/H-o-me/index.jr p లింకును నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామని చెప్పారు.

అపరిచితుల నుంచి ఫోన్లను కొనరాదు..

సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులు అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయరాదని ఎస్పీ సూచించారు. అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కలిగిన బాక్సు ఉంటేనే కొనుగోలు చేయాలని తెలిపారు.

పక్క రాష్ట్రాల నుంచి..

మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన వాటి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారన్నారు. ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్ జోసెఫ్, సైబర్ క్రైమ్ సిబ్బంది, మొబైల్ రికవరీ బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బందికి రివార్డ్స్ ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేష్, కె.రాజారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు మధు, రాఘవరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, పెద్దయ్య, ఇతర పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ, చౌక బియ్యం స్వాధీనం

ఖాజీపేట : పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని అడ్డదారిలో తరలించుకుపోతున్న లారీని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారి వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన తాటి శాంతి కుమార్‌కు చెందిన ఏపీ 39 యూఏ 3609 నంబరు గల వాహనంలో 233 చౌక బియ్యం బస్తాలను ఎక్కించారు. బుధవారం తెల్లవారుజామున ప్రొద్దుటూరు నుంచి కడపకు తీసుకెళుతుండగా పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ శివన్న ఆయన బృందం వాహనాన్ని వెంబడించారు. ఖాజీపేట మండలం పాటిమీదపల్లె వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్దకు రాగానే వాహనం స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ పుట్టాల ఓబులేసు, దేవగుడి రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని ఖాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పరిశీలించగా 1,417 కేజీలు బరువు గల 233 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

ఖాజీపేట : రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొని పుల్లూరు బాలస్వామి (47) అనే వ్యక్తి మృతి చెందాడు. పుల్లూరు బంగ్లా వద్ద ఉన్న బాల స్వామి పని నిమిత్తం రావులపల్లె చెరువు వద్ద దిగి రోడ్డు దాటుతుండగా కడప నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి బంధువులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో తోసేయడంతో..

జమ్మలమడుగు రూరల్ : మద్యం మత్తులో ఒక వ్యక్తి మరో వ్యక్తిని తోసేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్‌లో జరిగింది. పట్టణ ఎస్ఐ హేమలత ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చెంద్రాయుడు (30) అదే కాలనీకి చెందిన నాగేంద్ర యాదవ్ కలిసి కాలనీలోని పెద్దమ్మ గుడి సమీపంలో మంగళవారం రాత్రి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో చెంద్రాయుడును నరేంద్ర యాదవ్ తోసేయడంతో పక్కన ఉన్న రాయి తలకు తగిలింది. దీంతో తీవ్ర రక్తస్రావమైన అతనికి కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బేల్దార్ పనులు చేసుకొని జీవించేవాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల హోదా మార్పు

ప్రొద్దుటూరు క్రైం : వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా ప్రభుత్వం మార్పు చేసినట్లు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు వివిధ రకాల వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోగ్య సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు ప్రాంతీయ కంటి ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, మెడికల్ కాలేజీల్లో సేవలు అందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్‌ను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా హోదా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నంబర్ 64 ద్వారా బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జయప్రకాష్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్లు సాధు వెంకటేశ్వర్లు, మహమ్మద్‌రఫీ, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్త చేశారు.

అవినీతి పనులు చేయాలని వేధిస్తున్నారు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అవినీతి పనులు చేయాలని వేధింపులకు గురిచేస్తున్నారు. నేను అక్రమాలకు పాల్పడలేను. మానసికంగా ఒత్తిడి తట్టుకోలేక సెలవులో ఉన్నాను. ఆ సెలవును పొడిగించాలని ఒక సీనియర్ అసిస్టెంట్ వేడుకోవడం సంచలనంగా మారింది. వివరాలలోకి వెళితే.. వైద్య ఆరోగ్య శాఖలో అది జోనల్ స్థాయి విభాగం. అక్కడ ఒక సీనియర్ అసిస్టెంట్ విధులను చేపడుతున్నారు. ఏ కారణం చేతనో తెలియదు ఒక నెల రోజులుగా సెలవులో ఉన్నారు. సెలవు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఆ సీనియర్ అసిస్టెంట్ మరో నెల గడువు పొడిగించాలని అభ్యర్థించారు. అంత వరకు బాగానే ఉంది. సెలవు గడువు పొడిగించడానికి చెప్పిన కారణాలే సంచలనంగా మారాయి. అవినీతి..అక్రమాలకు పాల్పడాలని.. చెప్పింది చేయాలని వేధింపులకు గురి చేస్తున్నారు. నేను నైతిక విలువలకు కట్టుబడి ఉంటాను. అవినీతి పనులు చేయలేను. వేధింపుల కారణంగానే నేను మానసిక ఒత్తిడికి లోనయ్యాను. నా సెలవును మరో నెల రోజుల పాటు పొడిగించాలి.. అని పై అధికారికి విన్నవించారు. ఈ అంశం వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆటో బోల్తా

పులివెందుల రూరల్ : తొండూరు మండలం సైదాపురం గ్రామ సమీపంలోని గోడౌన్ వద్ద ముద్దనూరు రోడ్డు వైపు వెళ్తున్న ఆటో టైర్ పగిలి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కడపకు తరలించారు.

టీడీపీ నేతల దాష్టీకం


- బాధితులను పరామర్శించిన ఎంపీ
- కేసు నమోదు చేయాలని డిమాండ్




చలపతి కుటుంబ సభ్యుల విషయమై పోలీసులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి పులివెందులలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. వారం రోజుల క్రితం వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ జెండాలు, తోరణాలు కట్టారని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ జెండాలు, తోరణాలను వైఎస్సార్ విగ్రహం వద్ద తొలగించారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించినందుకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీసుల అత్యుత్సాహంతో హత్యాయత్నం కేసు దాదాపు 15మంది వైఎస్సార్‌సీపీ నాయకుల మీద నమోదు చేసిన విషయం విదితమే. అందులో ఎస్టీ కులానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చలపతిని కూడా కేసులో ఇరికించడంతో అతను పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో నగరిగుట్ట ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీను మరికొంత మంది వ్యక్తులతో కలిసి చలపతి ఇంటికి చేరుకుని వారి ఇంట్లో ఉన్న మహిళలపై దాడి చేశారు. మంగళవారం అర్ధరాత్రి చలపతి కుటుంబ సభ్యులు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం చలపతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దాడి జరిగిన విషయాన్ని పులివెందుల సీఐకి ఫోన్ చేసి ఇప్పటికే అక్రమ కేసు పెట్టి చలపతిని జైలులో ఉంచారని, ఇప్పుడు వారి కుటుంబ సభ్యులపైన టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వెంటనే బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులమీద కేసు నమోదు చేయాలని ఎంపీ గట్టిగా డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా అండర్–23 క్రికెట్ టోర్నమెంట్



125 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచిన అనంతపురం బ్యాట్స్ మెన్ వీరారెడ్డి



80 పరుగులు చేసిన లోహిత్ లక్ష్మీ నారాయణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్– 23 వన్డే క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 7 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 45.1 ఓవర్లలో 217 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెడ్డి రుషిల్ 60, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 3, ప్రదీప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 218 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 25.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కే హెచ్. వీరారెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 125 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచాడు. 69 బంతులను ఎదుర్కొని 14 బౌండరీలు, 7 బౌండరీ సిక్సులు సహాయంతో 125 పరుగులు చేశాడు. అర్జున్ టెండూల్కర్ 27 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మహమ్మద్, రెడ్డి ప్రకాష్, డేనియల్ లు ఒక్కో వికెట్ తీసుకున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై 13 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు 31.0 ఓవర్లలో 145 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్ రెడ్డి 28, అఖిల్ సాలుంకే 26 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4, చెన్నారెడ్డి 3, విజయ భావేంద్రారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 146 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవి చూసింది. ఆ జట్టులోని నాగ చాతుర్య 32, షేక్ ఆదిల్ హుస్సేన్ 40 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాత్విక్ 3, సయ్యద్ అతిక్ సల్మాన్ 3, మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు.